పౌష్టికాహారానికి పోషణ్ వాటికలు

- ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు మంజూరు
- సత్ఫలితాలనిస్తున్న పథకం
- 705 కేంద్రాలలో అమలు
- దశల వారీగా విస్తరణ



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోషణ్ వాటిక



పోషణ్ వాటిక నుంచి ఆకు కూరను గర్భిణికి అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రాజానగరం: గ్రామీణ ప్రాంతాలలో చిన్నారులు, కిశోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలలో పౌష్టికాహార లోపం ఏర్పడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పోషకాహారాన్ని ఇంటి వద్దనే సమకూర్చుకునే పద్ధతులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. పోషకాహారం తయారీ ఖర్చును తగ్గించడంతోపాటు, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువులతో ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల ఉత్పత్తిని పెంపొందించేలా 'పోషణ్ వాటిక' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలోనే శ్రీకారం చుట్టిన ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణ (పెరటి)లోనే ఆయా మొక్కల పెంపకం చేపట్టేలా ఎంపిక చేసిన ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు సాయాన్ని కూడా అందజేశారు.

ఉపాధి పథకం సహకారంతో..

సొంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన ఖాళీ స్థలాల్లో ఈ పథకాన్ని ఉపాధి హామీ పథకం సిబ్బంది సహకారంతో అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది చూపించిన ఖాళీ స్థలాలను శుభ్రం చేసి, వాటిలో ఆకు కూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచేలా విత్తనాలు సరఫరా చేస్తారు. వాటి పెంపకానికి అవసరమైన జీవామృతం, కషాయాలను తయారు చేసి, వాటిని ఉపయోగించుటలో అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కలిగిస్తారు. ఎందుకంటే వారే వీటి పెంపకంలో కీలక పాత్ర వహించవలసి ఉంటుంది కాబట్టి. ఈ విధంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలతోపాటు గోకవరం మండలంలోని 705 అంగన్‌వాడీ కేంద్రాలలో 'పోషణ్ వాటిక' పథకాన్ని అమలు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం కోసం ..

నేటి ఆధునిక సమాజంలో తక్కువ సమయంలో ఎక్కువ రాబడిని పొందాలనే ఆశతో ఆహార పంటలు కూడా కలుషితమైపోతున్నాయి. తక్కువ కాలవ్యవధితో కూడిన వంగడాలను ఎంచుకోవడంతోపాటు మంచి దిగుబడుల కోసం రకరకాల క్రిమి సంహారక మందులను వాడటం ద్వారా ఇవి కలుషితమవుతున్నాయనే విషయం అందరికీ తెలిసినా, నిరోధించే చర్యలు శూన్యం. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం సాధ్యమైనంత వరకు ఆరోగ్యవంతమైనది, నాణ్యతతో కూడిదై ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా ఆరోగ్యవంతమైన ఉత్పత్తులతోపాటు ఖర్చులను కూడా ఆదా చేసే విధంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో మార్కెట్లో కూరగాయాల ధరలు అమాంతం పెరిగిపోతుంటాయి. ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం మెనూ ప్రకారం తయారు చేయడం చాలా కష్టమవుతుంది. అటువంటి సమయంలో ఈ 'పోషణ్ వాటిక'ల ద్వారా ఈ సమస్యను సులువుగా అధిగమించడానికి అవకాశం ఉంటుంది. వీటిలో కొత్తిమీర, తోటకూర, బచ్చలి వంటి ఆకు కూరలు, వంగ, చిక్కుడు, బెండ, టమాటా వంటి కూరగాయాలు పండించడం వలన వాటితో మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని తయారుచేసి అందించవచ్చు. అంతేకాదు ఉత్పత్తి ఎక్కువగా ఉంటే ఈ పథకం అమలు కానీ కేంద్రాలకు కూడా వీటిని సరఫరా చేసి, ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

> **దశల వారీగా పథకాన్ని విస్తరిస్తాం**
>
> ప్రస్తుతం 'పోషణ్ వాటిక' పథకం డివిజన్‌లోని 705 కేంద్రాలలో అమలు జరుగుతుంది. సొంత భవనాలతోపాటు ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తొలిదశలో ఎంపిక చేశాం. రెండో దశలో జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఈ పథకాన్ని విస్తరిస్తాం.
>
> – కె.విజయకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

క్లుప్తంగా

170 మందికి కంటి పరీక్షలు



బిక్కవోలులో ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభించిన నాయకులు

బిక్కవోలు: స్థానిక సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక డాక్టర్ టి.రాజీవ్ ప్రారంభించారు. 170 మంది రోగులను పరీక్ష చేసి 45 మందికి ఆపరేషన్ అవసరం అని గుర్తించారు. మిగిలినవారికి మందులను అందించారు. రాజీవ్ మాట్లాడుతూ మనిషి అన్ని అవయవాలలో కన్ను అతి ముఖ్యమైనది అని తెలిపారు. 40 ఏళ్ళ వయస్సు దాటిన ప్రతి ఒక్కరు 6 నెలలకు ఒక సారి కంటి పరీక్షలు చేసుకోవడం చాలా మంచిది అన్నారు. రావడ నాగు, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం కమిటీ మాజీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, తొండాపు సత్యనారా యణరెడ్డి(పండు), సన్నిది రాజు రాంబాబు, తొండాపు నర్సిరెడ్డి, జంగా విహారి పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి ఉత్సవాలు



కోటపాడు సాయిమందిరం వద్ద పూజలు చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు

రంగంపేట: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంగంపేట, ఈలకొలను, కోటపాడు, గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో బాల వికాస్ విద్యార్థులు సత్యసాయి పాదుకలకు, చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట సబ్జోన్ కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు, సేవా సమితి కన్వీనర్లు కందర్ప వెంకటఅమర్నాధ్, తిక్కిశెట్టి సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జి పోతుల ఈశ్వరరావు, వేదాధ్యయన సమన్వయ కర్త కందర్ప శ్రీరామ్‌శర్మ, జిల్లా విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్. శ్రీనివాసరాజు, సేవా దళ్ సభ్యులు, బాలవికాస్ గురువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ సూర్యనారాయణమూర్తి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉష, ఛాయ, పద్మ, సొంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

సీతానగరం: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాజానగరం నియోజకవర్గ పార్టీ సమావేశం నిర్వహించారు. ఆదివారం సీతానగరంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సీతానగరం, కోరుకొండ మండల బ్లాక్ టు అధ్యక్షులు గుండుబోగుల శ్రీనివాసరావు (రంగాశ్రీను) అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ సమావేశంలో ముఖ్య అతిథులుగా నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి వడయారి శ్రీనివాస్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ లూథర్ పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాలని, గ్రామాల్లో విస్తృతంగా ప్రతి ఒక్కరిని కలిసి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ లూథర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దుళ్ల సూర్యనారాయణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అయిల శేషగిరి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మోత శారద, రాజానగరం మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీను, పిర్ల గణేష్, నల్లా వీర్రాజు, కొండ శ్రీను పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



అనుబంధ శాఖల అధ్యక్షులను సత్కరిస్తున్న జక్కంపూడి రాజా

రాజానగరం: అధిష్టానం ఇచ్చిన గుర్తింపుతో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులకు సూచించారు. నియోజకవర్గం నుంచి ప్రచార విభాగానికి అడబాల వీరసత్యనారాయణ (చినబాబు), సోషల్ మీడియా విభాగానికి వల్లభశెట్టి వెంకటసత్యనారాయణ, బీసీ సెల్ విభాగానికి కొండపల్లి దుర్గారావులను అధ్యక్షులుగా నియమించిన సంగతి విదితమే. వీరంతా ఆదివారం మర్యాద పూర్వకంగా రాజాను కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువాలతో సత్కరించి, అభినందిస్తూ బాధ్యతలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న, కర్రి నాగేశ్వర్రావు, సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వర్రావు, నాయకులు నక్కా రాంబాబు, నీలపాల శివరామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



హోమం చేస్తున్న దృశ్యం

రాజానగరం: దివాన్‌చెరువులోని హేరంబ గణపతి, బాలకుమారస్వామి సహిత విశ్వేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం వేద పండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా జరిగింది. సద్గురు కందుకూరి శివానందమూర్తి చేతుల మీదుగా ప్రతిష్ఠ జరిగిన ఈ ఆలయంలో 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ శిఖరానికి మహాకుంభాభిషేకం చేశారు. ఇందుకు ఉపయోగించిన జలంతో కూడిన కలశాలకు డాక్టర్ కంభంపాటి రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) దంపతుల ఆధ్వర్యంలో హోమాలు చేసి, పూర్ణాహుతిని సమర్పించారు. దివాన్‌చెరువుతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చిన జగన్మాతను దర్శించుకుని, మహాకుంభాభిషేకంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమ పూజలు జరిగాయి. సాయంత్రం వేళలో సంగీత కచేరి, పద్యగానం, కూచిపూడి నృత్యం, భాగవతోపన్యాసం, వీణావాదం నిర్వహించారు. శనివారం సద్గురు కందుకూరి శివానందమూర్తికి శిష్యపరివారంచే 'గురువందనం' పేరుతో భక్తి నీరాజనం సమర్పిస్తారు.

ఆదిరెడ్డికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నల్లమిల్లి ఆదిరెడ్డి

పెదపూడి: అనపర్తి గ్రామానికి చెందిన ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు నల్లమిల్లి ఆదిరెడ్డికి గౌరవ డాక్టరేట్ అవార్డును డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, ఆకుల రమేష్ చేతుల మీదుగా సిటీ కల్చరల్ సెంటర్ హైదరాబాద్‌లో ఈ నెల 1న అందజేశారు. ఈ మేరకు ఆదిరెడ్డి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ డాక్టరేట్ హెల్త్ కేర్ సర్వీస్ ఇన్ ఫార్మసీ, సోషల్ సర్వీస్, యూత్ డెవలప్‌మెంట్ విభాగాల్లో లభించిందన్నారు. అసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, అసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ అవార్డు ప్రధానం చేశాయన్నారు. ఆదిరెడ్డికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన పుల్ల వెంకట్రావు(45) కాకినాడలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. కోరుకొండ ఎస్సై శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకట్రావు శనివారం అర్ధరాత్రికోరుకొండ నుంచి దోసకాయలపల్లి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఆయనను స్థానికుల సహాయంతో 108లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆయన ఆదివారం సాయంత్రం మృతి చెందినట్టు ఎస్సై వ్యామ్‌సుందర్ తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు



ఈలకొలనులో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలను గ్రామంలో ఆదివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం డ్రమ్ములు, బెల్లపు ఊటను ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు

సీతానగరం: మండలంలో కాటవరం సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఆదివారం కాటవరం శివాలయం ఆవరణలో సమరసత సేవా జిల్లా ధర్మ ప్రచారక్ కర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి ప్రతి హిందూ సభ్యత్వం పొందాలన్నారు. ప్రతి హిందూ దేశ ధర్మం పట్ల శ్రద్ధ కలిగి సభ్యులుగా చేరాలని, సభ్యత్వాల ద్వారా వచ్చిన ధర్మనిధి ఏర్పాటు చేసి, సభ్యుల శక్తిని పెంచుకోవాలన్నారు. సేవా సమితి కరపత్రాలు ప్రతి ఇంటికి చేరాలని సూచించారు. అనంతరం సేవా సమితి సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా సమితి మండల కన్వీనర్ బి బంగారయ్య, సహ కన్వీనర్ బొల్లి వేణు గోపాలకృష్ణ, మండల మహిళా కన్వీనర్ కె.అభిలాష, గ్రామ కన్వీనర్లు డాక్టర్ సత్యం రమేష్‌బాబు, కె.అరుణ, కార్యకర్తలు దుర్గ, త్రిమూర్తులు, అంజిబాబు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధితో ఆధ్యాత్మిక శోభ



కాపవరంలో ఆలయాల అభివృద్ధి కమిటీ నాయకులకు చెక్కులను అందజేస్తున్న శ్రీనివాసరావు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామదేవత పాశాలమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన జరిగింది. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలను కాచి కాపాడాలని కోరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల అభివృద్ధి ద్వారానే సనాతన ధర్మం తేజరిల్లుతోందన్నారు. రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లోని ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి గతంలో ఇచ్చిన రూ.లక్ష కాకుండా, మరో రూ.3 లక్షల చెక్కును కమిటీ పెద్దలకు అందజేశారు. పాశాలమ్మవారి అన్నసమారాధన నిమిత్తం ఆయన లక్ష రూపాయలు విరాళాన్నిచ్చారు. స్థానిక వడ్డీలపేటలోని రామాలయం నిర్మాణానికి రూ.1,60,000. పోలేరమ్మవారి ఆలయానికి రూ.1,00,000 ప్రకటించి, రూ.50,000 చెక్కును ఆల య కమిటీకి అందజేశారు. లక్కీ డ్రా నిర్వహించి 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మామిడి అయ్యప్ప, బాపన్నదొర, వరసాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఓంశక్తి సత్సంగం వార్షికోత్సవం



అమ్మవారి భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: అనపర్తి మండలం పొలమూరు గ్రామం దేవీ సెంటర్లో గల ఓం శక్తి సత్సంగం పీఠం 29వ వార్షికోత్సవం పీఠం అధినేతలు మల్లిడి వీరరాఘవ రెడ్డి, గొలుగూరి విజయలక్ష్మి గురుమాత ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు దుర్గాదేవి అమ్మవారికి భక్తి గీతాలు ఆలపించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మధుమేహ వ్యాధి వైద్య నిపుణుడు తాడి రామగురెడ్డి ఆయన సతీమణి లలితారాణి దంపతులను తాడి సుబ్బారెడ్డి, సతీమణి చెల్లాయమ్మ దంపతులు సత్కరించారు.

ఘనంగా సూర్యారాధన



సూర్యానారాయణ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సూర్యారాధన, సూర్య నమస్కారాలు, సూర్యహోమం, గోపూజ కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు ఎ.సూర్యనారాయణ, వడలి శివ సుబ్రహ్మణ్య వర్మలు మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. మాఘమాసంలో ప్రత్యేకంగా సూర్య ఆరాధన చేస్తామని, మాఘమాసం ప్రారంభం నుంచి మాఘ పౌర్ణమి వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 8న ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తామన్నారు.

ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఆదివారం ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక వర్గం యువకులు మరో వర్గం యువకులను కామెంట్ చేయడంతో తలెత్తిన వివాదంలో కర్రలతో కొట్టారు. ఒక సామాజిక వర్గం వ్యక్తి ఆదివారం మరణించడంతో అక్కడకు వచ్చినవారు యువకులను కొట్టిన విషయం తెలుసుకుని రాత్రి 7 గంటలకు కర్రలతో సర్పంచ్ వీధిలోకి వచ్చి వీరంగం చేయడంతో అక్కడ భయానక వాతావరణ ఏర్పడింది. దీంతో ఇరు సామాజిక వర్గాల యువకులు కొట్టుకోవడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని రెండు వర్గాల యువకులను చెదరకొట్టారు. గాయపడిన ఇరు వర్గాల వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎస్సై రామ్ కుమార్ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇనుగంటివారిపేటలో కలసిన పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో గల శ్రీద్వారకామయి ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో 1981 – 82 ఏడాది 10వ తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చిక్కాల దేవానంద్, పల్లేటి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వీరిలో కొంతమంది ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలు, వ్యాపారులు, వ్యవసాయదారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులుగాను ఉన్నారు. చదివిన రోజుల్లో చేసిన అల్లరి పనులు, చిలిపి పనులు గుర్తు చేసుకొని, ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గడిపారు. ప్రతి ఏడాది కలుసుకోవడమే కాకుండా తమ సహచరులకు అత్యవసర పరిస్థితులు వస్తే ఆదుకునే విధంగా ఒక నిధిని ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు తీర్మానించారు.

వలంటీర్ల ఆధ్వర్యంలో సేవ్ గోదావరి



పుష్కరఘాట్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్.ఎస్.ఎస్., యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన 80 మంది వలంటీర్లు గోదావరి జలాలను రక్షించాలి అనే సదుద్దేశంతో పుష్కర ఘాట్‌లోని గోదావరి నది ఒడ్డున ప్లాస్టిక్ సంచుల ఏరివేత, వ్యర్థ పదార్థాలను తొలగించడం తదితర కార్యక్రమాలను చురుకుగా చేశారు. కార్యక్రమానికి స్థానిక ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అధ్యక్షత వహించగా, సెంట్రల్ జోన్‌డీఎస్పీ కె రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా యూత్ రెడ్ క్రాస్ ఎంసి మెంబర్ డాక్టర్ జీఎస్‌వీఎబీఎస్ మహాలక్ష్మి హాజరయ్యారు. డీఎస్పీకే రమేష్‌బాబు మాట్లాడుతూ ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పుష్కరాల్లోనూ శివరాత్రి దసరా ఉత్సవాలలో ఎంతో సేవ చేశారని గంగిరెడ్డి సహకారం మరువలేనని ఈ సంవత్సరం కూడా మహాశివరాత్రికి వారి సేవలు అవసరమవుతాయన్నారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు పి.వి. ఎస్.కృష్ణారావు, కె.సుధాకర్ పట్నాయక్, చందనరాజు, పాల్గొన్నారు. ఎం.హెచ్.ఓ. వినూత్న సహకారంతో కార్యక్రమం జరిగింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.దుర్గాప్రసాద్, గణపతి కుమార్ హెల్పర్ వెంకట్, కానిస్టేబుల్ సీహెచ్ రాజేష్ ఎన్.ఎస్.ఎస్.టీం లీడర్స్ మౌనిష్, లక్ష్మీసుమ, వినయ్, సందీప్, సూర్య కీలకపాత్ర వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పోలకొండ సాయి, కె.మహేశ్వరి పాల్గొనగా డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి సహకరించారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులు



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించిన జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌ను జిత్‌మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా ద్వారా అప్పట్లో సత్కరించుకోవడం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ నట,గాయకులు జిత్‌మోహన్ మిత్ర అన్నారు. ఆదివారం స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై విశ్వనాథ్ ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. జిత్‌మోహన్‌మిత్ర, ముద్రగడ ఏసుబాబు, వివిఎస్‌ప్రసాద్‌లు కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కె.విశ్వనాథ్ రాజమహేంద్రవరం కళాకారులతో రూపొందించిన చిత్రాలకు సహకరించడంతో పాటు ఆయన చిత్రాల్లో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు, సంగీతానికి కళలకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందించిన చిత్రాల ద్వారా ఎప్పటికీ సజీవంగానే అందరి మదిలో ఆయన నిలిచిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు విశ్వనాథ్ చిత్రాలలో విజయవంతమైన గీతాలు పాడి స్వర నివాళి అర్పించారు. డాక్టర్ గిరిజాలసోమరాజునాయుడు, జల్లి శివప్రసాద్, సుక్కిరెడ్డి శ్రీనివాస్, పీవీఎస్ కృష్ణారావు, బి.సీతారామారావు, నాగేంద్ర, డాక్టర్ హరి, జి.వి.ఎస్.లక్ష్మీతులసి, గుంటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.